సాక్షి

పార్వతీపురం మన్యం

సోమవారం, 21, అక్టోబర్, 2024



వీరులారా అమర్ రహే..!

శాంతి భద్రతల పరిరక్షణలో నేలరాలిన వీర కిశోరాలెన్నెన్నో జిల్లాలో ఉన్నాయి.

- 8లో



అక్రమ గ్రానైట్ లీజు లైసెన్స్ రద్దు చేయాలి

- 8లో

బడిదేవరకొండపై ఎంఎస్‌పీ గ్రానైట్ లీజు లైసెన్స్ అక్రమం, చట్టవిరుద్ధం, పర్యావరణ వ్యతిరేకమని పలువురు పేర్కొన్నారు.



మరో 'రియల్' దగా..!

- 8లో

రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ఏజెంట్ల ద్వారా సుమారు రూ.20 కోట్ల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసిన ఘటన వెలుగులోకి వచ్చింది.

న్యూస్‌రీల్

నేడు మెగా జాబ్‌మేళా

పార్వతీపురం: పట్టణంలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా 18 నుంచి 30 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుకున్న యువత జాబ్ మేళాలలో పాల్గొనవచ్చునన్నారు. ఈ జాబ్ మేళాకు 18 రకాల కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువత హెచ్‌టీటీపీఎస్://స్కిల్ యూనివర్స్.ఏపీ ఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసి బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. వివరాల కోసం 63051 10947, 89788 78557 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చిన్నారికి స్థానం



నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డును సాధించిన చిన్నారి దన్షిక

బొబ్బిలి రూరల్: మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన ఐదు నెలల చిన్నారి సిరికి దన్షిక తన ప్రతిభతో నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించి అందరి నోటా ఔరా అనిపించింది. 120 ఫ్లాష్ కార్డులను గుర్తించి నోబెల్ బుక్ ఆప్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. గ్రామానికి చెందిన సిరికి లక్ష్మన్నాయుడు, హారిక దంపతుల కుమార్తె దన్షికకు రెండు నెలల వయస్సు నుంచే తల్లిదండ్రులు వివిధ వస్తువులు, బొమ్మలు చూపిస్తూ గుర్తుపట్టేలా అవగాహన కల్పించారు. ఇలా 120 రకాల విభిన్న ఫ్లాష్‌కార్డులు (జంతువులు, పక్షులు, కూరగాయలు, పండ్లు, రంగులు వివిధ దేశాల జెండాలు) గుర్తు పడుతోన్న వీడియో రికార్డులను నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థకు పంపగా పై సంస్థ ప్రతినిధులు ప్రశంసాపత్రంతో పాటు మెడల్స్‌ను దన్షిక తల్లిదండ్రులకు పంపించారు. ఈ సందర్భంగా ఆదివారం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చిన్నారి దన్షికను అభినందించారు.

డయేరియా తగ్గే వరకు ఇంటికి పంపించొద్దు

గుర్ల: డయేరియాతో బాధపడుతున్న రోగులకు పూర్తి స్థాయిలో తగ్గే వరకు ఆస్పత్రిలోనే చికిత్స అందించాలని గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారులకు రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్ ఎ.సిరి ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డయేరియాతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్న రోగులతో ఆమె ఆదివారం మాట్లాడారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం నాగళ్లవలస గ్రామంలో ఆమె పర్యటించారు. ఆమె వెంట రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి, డీఎంహెచ్‌ఓ భాస్కరరావు ఉన్నారు.



నాగళ్లవలస సచివాలయంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

అదే తీరు..

జిల్లాలోని గుర్లలో డయేరియా విజృంభించి పలువురిని పొట్టన పెట్టుకొని.. వందల సంఖ్యలో ప్రజలు బాధితులైనా ఇటు అధికారుల తీరుగాని.. అటు పాలకుల తీరుగాని ఏమాత్రం మారలేదు. మరణాలకు ఏవో కుంటిసాకులు వెతుకుతున్నారే తప్ప.. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్న ఆలోచన చేయడం లేదు. ఇప్పటికీ రోగులకు సరైన సదుపాయాలు కల్పించడం లేదు. వారి పరిస్థితి ఎలా తయారైందంటే ఎవరి మంచం వారే తెచ్చుకోవాలన్న దుస్థితికి చేరింది. ఆదివారం గుర్లలో మరొకరు మృతి చెందగా మండలంలో మరో 15 కొత్త కేసులు బయటపడ్డాయి. ఇంత జరుగుతున్నా... పాలకులు ఈ తప్పిదం నుంచి బయట పడేందుకు డయేరియా ప్రబలేందుకు గత ప్రభుత్వ తీరే దీనికి కారణమని నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు.

- ఆదివారం మరొకరు మృతి
- డయేరియా బాధితులకు సొంత మంచాలే గతి
- నాగళ్లవలసలో మరో ఎనిమిది కొత్త కేసులు
- గ్రామ సచివాలయంలోనే ముగ్గురికి మంచాలపై వైద్యం
- ఇద్దరు చీపురుపల్లి సీహెచ్‌సీకి, ముగ్గురు ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు
- గుర్ల హైస్కూల్‌లోని వైద్య శిబిరం ఖాళీ
- కొత్తగా మూడు బెడ్‌లు సిద్ధంగా ఉంచిన అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా టీడీపీ కూటమి ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు. చివరకు విజయనగరం జిల్లా కేంద్రానికి పట్టుమని పన్నెండు కిలోమీటర్ల దూరం కూడా లేని గుర్ల మండలంలో, అదీ మైదాన ప్రాంతంలో డయేరియా పంజా విసురుతున్నా నియంత్రించలేకపోయింది. 11 మంది ఆ వ్యాధితో, మరో ఐదుగురు ఇతర రోగాలతో బాధపడుతూ డయేరియా బారినపడి చనిపోయారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుండబద్దలుకొట్టి మరీ చెప్పారు. ఇది కచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే! దీన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆపసోపాలు పడుతున్నారు. అబ్బే... డయేరియా వల్ల మృతి చెందినవారు ఒక్కరంటే ఒక్కరే అని టీడీపీ నాయకులు బుకాయిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై విచారణకు వస్తున్నారు. మరోవైపు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం జిల్లాకు వస్తున్నారు. గుర్లలో పర్యటించి తర్వాత కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. ఈలోగా గుర్ల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో రోగులు ఎవ్వరూ లేకుండా చూసుకుంటున్నారు.

కొత్తగా మరో 15 కేసులు

గుర్ల మండలంలో డయేరియా కొత్త కేసులేవీ లేవని ప్రభుత్వం ప్రకటించినా ఆదివారం కొత్తగా 15 కేసులు బయటపడ్డాయి. వారిలో ఐదుగురు గుర్ల గ్రామస్తులే. స్థానిక హైస్కూల్‌లో విద్యార్థుల బెంచీలపై గత వారం రోజులుగా నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో ఆదివారం మూడు బెడ్‌లు ఏర్పాటు చేశారు. కానీ డయేరియా బాధితులను అక్కడ చేర్చలేదు. ఇద్దరిని గుర్ల పీహెచ్‌సీలో చేర్చారు. ముగ్గురిని నెల్లిమర్ల సీహెచ్‌సీకి రిఫర్ చేశారు.

గుర్ల పీహెచ్‌సీలోనే అంతా...

డయేరియా రోగులకు ఇప్పుడు గుర్ల పీహెచ్‌సీలోనే వైద్యం అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక్కడ గతంలో ఏడు బెడ్‌లు ఉండేవి. వీటికి అదనంగా మరో ఎనిమిది బెడ్‌లు ఆదివారం ఏర్పాటు చేశారు. శనివారం వరకూ ఇక్కడ ఎనిమిది మందికి వైద్యం అందిస్తున్నారు. కెల్ల గ్రామంలో ఆదివారం కొత్తగా నమోదైన రెండు కేసులను ఇక్కడికే రిఫర్ చేశారు. మొత్తం పది మంది రోగులకు ఇక్కడ వైద్యం అందిస్తున్నారు.

డయేరియాతో మరొకరి మృతి

గుర్ల: మండల కేంద్రంలో డయేరియా మరణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటికే డయేరియాతో పలువురు మృతి చెందగా ఆదివారం గుర్ల గ్రామానికి చెందిన నేరడబిల్లి పాపారావు (62) ఆదివారం మృతి చెందాడు. ఆదివారం ఉదయం రెండు విరేచనాలు అయ్యాయని వైద్యాధికారులను సంప్రదించగా వారిచ్చిన మాత్రలు వేసినట్లు చెబుతున్నారు. అయినప్పటికి పాపారావు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గొల్లుమన్నారు. పాపారావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని అందువల్లే మరణించినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

గ్రామ సచివాలయంలో శిబిరం

ఇప్పటికే ఒక డయేరియా కేసు నమోదైన నాగళ్లవలసలో ఆదివారం ఎనిమిది కొత్త కేసులు నమోదయ్యాయి. అధికారులు హుటాహుటిన స్థానిక గ్రామ సచివాలయం భవనంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గుర్ల హైస్కూల్‌లో మాదిరిగానే ఇక్కడా రోగులకు బెడ్‌లు లేవు. ఎవరి మంచాలు వారినే వెంట తెచ్చుకోమన్నారు. ఆ మంచాలపైనే ముగ్గురికి ప్రస్తుతం వైద్యం అందిస్తున్నారు. ఇద్దరిని చీపురుపల్లి సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. మరో ముగ్గురు మాత్రం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు.

మెరుగైన వైద్యం అందించాలి : బొత్స

గుర్ల: డయేరియా బారిన పడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వైద్యాధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డయేరియాతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారిని ఆయన ఆదివారం పరామర్శించారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. డయేరియా రోగులను పరామర్శించిన వారిలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, జమ్ము స్వామినాయుడు, ఇజ్జిరోతు ప్రసాద్, మంత్రి వెంకటరమణ, బోడశింగి అప్పలనాయుడు ఉన్నారు.



డయేరియా రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అనునిత్యం ప్రజల్లోనే

ఉన్నాను.. ఉంటాను...



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండగా నిత్యం ప్రజల్లోనే ఉండేవాడినని, ఇప్పుడు ఆ హోదా లేకున్నా... ప్రజల మనిషిగా ఇప్పుడూ తాను ప్రజల్లోనే ఉంటున్నానని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. తానింకా మంత్రి అనే భ్రమలో ఉన్నానంటూ మంత్రి సంధ్యారాణి విమర్శించడాన్ని ఆయన ఖండించారు. తాను ఉప ముఖ్యమంత్రిగా ఉండగా ఏనాడు సెక్రటేరియట్‌లో పూర్తిగా ఉండిపోలేదని, విమానాల్లో తిరిగి ఎంజాయ్ చేయలేదని, ప్రజాధనాన్ని వృథా చేయలేదని గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ బాధ్యతలు నిర్వరిస్తూనే మరోవైపు నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ల్యాండ్, శాండ్, వైన్స్, మైన్స్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని వారి పచ్చ మీడియాల్లోనే వీటికి సంబంధించి పతాక శీర్షికన కథనాలు వస్తున్నాయని చెప్పారు. మంత్రి సంధ్యారాణి వాస్తవాలు గుర్తెరిగి మాట్లాడాలన్నారు. ఐటీడీఏ డీడీని సరెండర్ చేసి సోషల్ వెల్ఫేర్ డీడీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో అక్కడ రెగ్యులర్ డీడీని నియమించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్న విషయాన్ని మంత్రి సంధ్యారాణి గుర్తించి సమాధానం చెప్పాలని అన్నారు. గిరిజన నిరుద్యోగ యువకులు ప్రత్యేక డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారని, జీఓ నంబరు 3 పునరుద్ధరణ చేయకుండా గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ అమలు చేయలేరన్నారు. గిరిజనులకు మంత్రి వీటి విషయమై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

శ్యామలాంబ పండగ నిర్వహణ ఆర్థిక భారం ప్రజలపై మోపొద్దు..

పట్టణంలోని శ్యామలాంబ పండగ నిర్వహణ కోసం ఆర్థిక భారం ప్రజలపై మోపొద్దని రాజన్నదొర కోరారు. ఆలయ అనువంశిక ధర్మకర్త యువరాజు తనతో ఫోన్‌లో ఆదివారం మాట్లాడారని చెప్పారు. పాడేరులో మోదుకొండమ్మ పండగకు తాను రెండేళ్లు రెండు కోట్లు రుపాయిలు మంజూరు చేసానని, శంబర పండుగకు 50 లక్షల రుపాయిలు గత ప్రభుత్వంలో మంజూరు చేయించానని గుర్తు చేశారు. మంత్రి సంధ్యారాణి ఈ పండగల భారాన్ని ప్రజలపై పడకుండా బాధ్యతగా నిర్వహించే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులుముఖ్వల ఆదయ్య, తాడ్డి యశోదకృష్ణ, చినపాత్రుని సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్త ట్రాక్టర్‌లో ఉత్సవ గజేంద్రుడు

- పైడితల్లి సంబరాల్లో కీలకం తెల్ల ఏనుగు
- ఉత్సవం ముగిసాక మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

విజయనగరం టౌన్: అంబరాన్ని తాకే సిరిమాను సంబరాలు.. శ్రీ పైడితల్లి అమ్మవారి నెలరోజుల ఉత్సవాలు... భక్తిశ్రద్ధలతో అమ్మవారికి భక్తులు సమర్పించే ఘటాలు... తెల్ల ఏనుగు, పాలధార, అంజలిరథం, బెస్తవారి వల, ఇలా అమ్మవారికి సమర్పించే ప్రతీదీ ఓ అపురూపమే. అమ్మవారు అంబారీ ఎక్కి ఊరేగుతారనే ఉద్దేశంతో సంబరాల్లో తెల్ల ఏనుగును ప్రత్యేక ఆకర్షణగా నిలుపుతారు. ఉత్సవం పూర్తవ్వగానే వాటిని చాలా జాగ్రత్తగా, భక్తిశ్రద్ధలతో భద్రపరుస్తారు. లేకపోతే వాటికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలాల్లో ఎవరికీ కనిపించకుండా ఉంచుతారు. అటువంటిది ఈ ఏడాది ఉత్సవంలో పాల్గొన్న అమ్మవారి తెల్ల ఏనుగు ఆదివారం ఒక్కసారిగా మున్సిపల్ చెత్త ఎత్తే ట్రాక్టర్‌లో ప్రత్యక్షమైంది. దీన్ని చూసిన ప్రతి ఒక్కరూ అయ్యో... దారుణమంటూ ముక్కున వేలేసుకున్నారు. లక్షలాది మంది భక్తజనం తిలకించి, స్పర్శించి, తరించిన తెల్ల ఏనుగు పరిస్థితిని చూసిన వారందరూ ఆవేదన చెందారు. మున్సిపల్ అధికారుల తీరును తప్పుబడుతున్నారు. తెలిసీ కూడా ఇటువంటి తప్పు చేసిన అధికారుల పైనా, సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ఇదేం కొత్తేమీ కాదు..

గతంలో ఈఓ శ్యామలాదేవీ పని చేసినప్పుడు సిరిమానును పెట్టేందుకు స్థలం లేదనే నెపంతో రోటరీ శ్మశానానికి వెళ్లే తోవలో కాలువ పక్కనే పడేశారు. దీక్షాపరులు గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. మరలా సాక్షిలో వచ్చిన కథనంతో అధికార యంత్రాంగం మేల్కొని, సిరిమానును రాజ్‌గోపాల్ టాంబ్రీలో భద్రపరిచారు. నాటి నుంచి నేటివరకూ సిరిమాను విషయంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదు. కానీ సిరిమానుతో పాటూ నడిచే తెల్ల ఏనుగుకి ఈ ఏడాది ఇలా చెత్తలెత్తుకునే ట్రాక్టర్ ద్వారా వీడ్కోలు పలకడం పట్ల భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావును ప్రశ్నించగా హుకుంపేటలోనే సిరిమాను, ఇరుసుమాను, తెల్ల ఏనుగు తయారవుతాయన్నారు. ఉత్సవం పూర్తయిన తర్వాత తిరిగి హుకుంపేటకు చేరుకున్నాయన్నారు. అయితే ఏమైందో తనకు తెలియదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా తాను విధి నిర్వహణలో ఉండగా ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో మున్సిపాల్టీ వాళ్లు పట్టుకుని వెళ్లిపోయారని సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు తెలిపారు. విషయం తెలుసుకున్న తర్వాత వెంటనే వాటిని సేకరించి వైఎస్ఆర్ నగర్ సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారన్నారు.

గిరిజన విద్యా సంస్థలపై...

కేంద్రం ఫోకస్



మల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల

- అదనపు సౌకర్యాలు, మౌలిక సౌకర్యాల కల్పనకు చొరవ
- దాత్రి అభ జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌లో నిధుల కేటాయింపు
- ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాల మెరుగుకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నిర్ణయం
- జిల్లాలో 52 గిరిజన వసతిగృహాల్లో దశలవారీగా మౌలిక సదుపాయాలు
- ప్రతిపాదనల తయారీలో అధికారుల కసరత్తు

సీతంపేట: గిరిజన సంక్షేమ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో అదనపు సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఈ నెల 2న దాత్రి అభ జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ పథకంలో గిరిజన ప్రాంతాల్లో గిరిజన సముదాయాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో విద్యకు సంబంధించిన అంశాలపై కేంద్రం ఫోకస్ పెట్టింది. సామాజిక న్యాయం, సాధికారతపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, పరిస్థితులు మెరుగుపర్చాల్సిన అవసరాన్ని చర్చించింది. పాఠశాలల్లో ఏఏ వసతులు ఉన్నాయి, ఇంకా ఏ సౌకర్యాలు కల్పించాలనేది వివరాలు సమర్పించాలని ట్రైబుల్ వెల్ఫేర్ డైరెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి వర్క్ షాపు గుంటూరులో ఈ నెల 22న నిర్వహించనున్నారు. ఏటీడబ్ల్యూఓల ఆధ్వర్యంలో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాఠశాలల వారీగా అవసరాలు గుర్తించి ప్రతిపాదనల తయారు చేశారు. ఈ నెల 21, 22న ఆఖరి జాబితా సిద్ధం కానుంది. దీనికి సంబంధించి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కేటాయింపులు ఇలా...

యూనిట్	అంచనా వ్యయం
మరుగుదొడ్లు	రూ.20 లక్షలు
తరగతి గదుల నిర్మాణం	రూ.35 లక్షలు
పెద్ద మరమ్మతులు	రూ.75 లక్షలు
తరగతి గదిలో ఫర్నీచర్	రూ.2.75లక్షలు
వసతిగృహ నిర్మాణం	రూ.2.75 లక్షలు
టీచర్ల క్వార్టర్లు	రూ.1.75 లక్షలు

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 52 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు ఉన్నాయి. 16 వేల మంది గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. 70 శాతం పాఠశాలల్లో 500ల పైబడే విద్యార్థులు ఉన్నారు. చాలా చోట్ల విద్యార్థుల సంఖ్యకు సరిపడా సదుపాయాలు లేవు. రానున్న మూడేళ్లలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ముందుగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో వసతులు కల్పించనున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, పాఠశాలల్లో బెంచీలు ఏర్పాటు చేయనున్నారు.

ఫార్మెట్‌లో వివరాలు పొందుపరుస్తున్నాం..



అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు ఒక ఫార్మెట్ ఇచ్చాం. హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఏటీడబ్ల్యూఓ, ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు సమస్యలు గుర్తించి ఆ ఫార్మెట్‌లో వివరాలు నింపారు. ఆ ప్రకారం ఫైనల్ జాబితా తయారు చేసి గుంటూరులో జరగనున్న వర్క్‌షాపుకు వెళ్లి సబ్‌మిట్ చేయనున్నాం. తదుపరి నిధులు కేటాయింపు జరగనుంది.

– అన్నదొర, డీడీ, గిరిజన సంక్షేమ శాఖ, సీతంపేట ఐటీడీఏ

ఆదివాసీల సంస్కృతిగా అక్షరబ్రహ్మ ఉద్యమం

- పురాతన అలవాట్లతోనే తగిన గుర్తింపు
- ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గొమాంగో



అక్షర బ్రహ్మ ఉద్యమంపై సూచనలు చేస్తున్న ఒడిశా మాజీ సీఎం డాక్టర్ గిరిధర్ గొమాంగో

భామిని: భారతీయ సంస్కృతిలో కీలకమైన ఆదివాసీ గిరిజన సాంప్రదాయాలతో అక్షరబ్రహ్మ ఉద్యమాన్ని విస్తృతపరచాలని ఒడిశా మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగో, గీతా శ్రీకాంత్ సేవా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ గీత, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పడాల భూదేవి అన్నారు. మండలంలోని నూకాలమ్మగూడలో అక్షరబ్రహ్మ ప్రచారకులు సవర కరువయ్య, బుద్దమ్మల ఆధ్వర్యంలో నిర్మించిన అక్షరబ్రహ్మ మందిరం ప్రారంభోత్సవంలో వారు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సవర లిపిని అక్షరాలను విగ్రహాలుగా వెలసిన అక్షర బ్రహ్మ ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వందృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఆదివాసీల మనుగడ, గుర్తింపు కోసం పురాతన ఆచారాలను వడిసిపట్టి అక్షర బ్రహ్మ ఉద్యమాన్ని విస్తృతపరచాలన్నారు. గిరిజనుల పురాతన ఆహారపు అలవాట్లను మెరుగుపరచి చిరుధాన్యాలను పండించి తినాలని పిలుపునిచ్చారు. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి ధర ఉందని, దీంతో ఆదాయం కూడా మెరుగుపడుతుందన్నారు. ప్రతీ గిరిజన పాఠశాలలో భాష వలంటీర్‌ను నియమించి సవర భాషను నేర్పించడంలో చొరవ చూపించాలన్నారు. అక్షరబ్రహ్మ ఆశ్రమం నిర్వాహకుడు సవర కరువయ్య మాట్లాడుతూ టీటీడీ సహకారంతో శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.10లక్షలతో మందిరం నిర్మించామన్నారు. గీతాశ్రీకాంత్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఆశ్రమ నిర్మాణం సాధ్యపడిందన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు థింసా నృత్యాలతో సందడి చేశారు. సరిహద్దు అక్షరబ్రహ్మ ఉద్యమ ప్రచారకులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్ - 9 చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న అండర్ – 9 ఓపెన్ బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ మేరకు నగరంలోని ఆర్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 160 మంది క్రీడాకారులు హాజరుకాగా.. రౌండ్‌ల వారీగా సాగిన పోటీల్లో క్రీడాకారులు గెలుపు కోసం ప్రత్యర్థుల ఎత్తుకు పై ఎత్తు వేస్తూ విజయాన్ని కైవసం చేసుకున్నారు. పోటీల్లో బాలుర విభాగంలో సీహెచ్.ధాన్విన్ రామ్ (కాకినాడ), ఎం.శ్రీసాకేత్ (అనంతపురం)లు, బాలికల విభాగంలో వి.మోదితారెడ్డి (తిరుపతి), సీహెచ్.అనన్య (తూర్పుగోదావరి)లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథులు సర్టిఫికెట్‌లు, ట్రోఫీలు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు


విద్యార్థినుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: స్థానిక పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మూడు లాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి ఆవరణలో ఆదివారం రాత్రి బీఎస్‌వై వైభవ లక్ష్మి బృందం చిన్నారుల నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. సామవేదుల సత్యలత భక్తిగీతాలు, వనంగుడి వద్ద వై.సాయిదుర్గాప్రసాద్ గిటార్ కచేరీ అలరించాయి. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కళాకారులను ఘనంగా సత్కరించారు.

ఘోషా ఆస్పత్రిలో చిన్నారులకు పరామర్శ


పిల్లలను పరామర్శిస్తున్న కేసలి అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విజయనగరంలోని ఘోషా ఆస్పత్రిలో డయేరియాతో చికిత్స పొందుతున్న గుర్ల గ్రామానికి చెందిన 11 మంది పిల్లలను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా బాలల హక్కుల కమిటీ చైర్మన్ హిమబిందు, చైల్డ్ లైన్ ప్రతినిధి మీనాకుమారి తదితరులు ఉన్నారు.

ఆకెళ్ల మృతి సంగీతరంగానికి తీరని లోటు



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వార్షికోత్సవంలో వయోలిన్ వాయిస్తున్న ఆకెళ్ల (ఫైల్)


విజయనగరం టౌన్: ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడు ఆకెళ్ల మల్లికార్జున శర్మ మృతి సంగీతరంగానికి తీరని లోటు అని ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మండపాక రవి ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం వెలిబుచ్చారు. హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. సంగీతపరంగా విజయనగరంతో ఆయనకు ఎనలేని అనుబంధం ఉందని ప్రకటనలో గుర్తుచేశారు. 1970–80 ప్రాంతంలో అసోసియేషన్‌లో ఆయన అనేక సోలో కచేరీలు, పక్కవాయిద్య సహకారం అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, ఉపాధ్యక్ష్యుడు దూసి శివరాం శర్మ, సలహాదారు పీఆర్‌కే.శాస్త్రి తదితరులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి డిస్కత్రో పోటీలకు గురుకుల విద్యార్థిని


ప్రమీల

నెల్లిమర్ల: పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని ఎ.ప్రమీల రాష్ట్రస్థాయి డిస్కత్రో పోటీలకు ఎంపికై ంది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాజాగా జరిగిన అండర్–19 జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఆమెను ఎంపిక చేశారు. ప్రమీల సీఈసీ గ్రూప్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రమీలను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని, పీఈటీ కామేశ్వరి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన జూదరులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో జూదం ఆడుతున్న ఆరుగురు నిందితులను నెల్లిమర్ల పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. స్థానిక టిడ్కో కాలనీ వద్ద జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకుని వారి నుంచి రూ.5520 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹137	₹244	₹254

వీరులారా సెల్యూట్..!



విధి నిర్వహణలో చేసిన ప్రమాణానికి కట్టుబడి సవాళ్లను ఎదుర్కొన్నారు. సమస్యలపై సమరం సాగించారు. అసాంఘిక శక్తుల అంతు చూశారు. అరాచక మూకలను అణిచివేశారు. విధి నిర్వహణలో అమరులై చిరస్మరణీయులయ్యారు. వీరులారా మీ త్యాగనిరతి వృథాపోదు. నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం.

- మరువలేనివి మీ త్యాగాలు
- అసాంఘిక శక్తులపై అలుపెరగని పోరు
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నేడు


అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ నివాళి(ఫైల్)

విజయనగరం క్రైమ్/పార్వతీపురంటౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో నేలరాలిన వీర కిశోరాలెన్నెన్నో జిల్లాలో ఉన్నాయి. వారి జ్ఞాపకాలను మననం చేసుకుంటూ ఏటా అక్టోబరు 21న పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం నిర్వహిస్తూ, వారిని గుర్తు చేసుకుంటూ పోలీస్ సిబ్బంది నివాళులర్పిస్తున్నారు. అమరులైన పోలీసువీరుల జ్ఞాపకార్థం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్థూపాన్ని 2002 అక్టోబరు 21న అప్పటి ఎస్పీ సౌమ్యమిశ్రా ప్రారంభించారు. ఇక్కడ నిర్మించిన వేదికపై అమరవీరుల పేర్లను రూపొందించారు. అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోంది. తక్షణ ఆర్థిక సాయం కింద రూ.9 లక్షలు, బీమా ద్వారా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ అందిస్తోంది. సర్వీసు కాలానికి పూర్తి జీతాన్ని చెల్లిస్తోంది. కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తూ, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తోంది. అమరవీరుల పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చదివిస్తోంది. ప్రయాణ చార్జీల్లో 75 శాతం రాయితీ ఇస్తోంది.

అమరవీరులు వివరాలివిలా..

ముద్దాడ గాంధీ



ముద్దాడ గాంధీ 1985లో ఆర్‌ఎస్సైగా చేరారు. 1991లో సివిల్ ఎస్సైగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పనిచేశారు. విధి నిర్వహణలో ధైర్య సాహసాలు ప్రదర్శించి మావోయిస్టులకు సింహస్వప్నంగా నిలిచారు. 2001 సెప్టెంబరు 28న ఒక కేసులో సాక్ష్యమిచ్చేందుకు సాలూరు కోర్టుకు వెళ్లినప్పుడు మావోయిస్టులు ఆయనపై అత్యంత కిరాతకంగా మెజిస్ట్రేట్ ఎదురుగానే కాల్పులు జరిపి హతమార్చారు. మావోయిస్టుల దొంగదెబ్బతో ఆయన సాలూరు న్యాయస్థానంలోనే ప్రాణాలు కోల్పోయారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ముద్దాడ గాంధీ త్యాగానికి ఎన్నిసార్లు శ్రద్ధాంజలి ఘటించినా తక్కువే అవుతుంది. ఆయన త్యాగ నిరతిని జాతి ఎన్నటికీ మరువలేదు.

సాలూరు కోర్టులో చిరంజీవిరావు



1985లో చిట్టిపంతులు చిరంజీవిరావు సివిల్ కానిస్టేబుల్‌గా చేరారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముద్దాడ గాంధీ అంగరక్షకుడిగా వ్యవహరించేవారు. సాలూరు కోర్టు ఆవరణలో మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో గాంధీతో పాటు ఆయన కూడా మృతిచెందారు.

మందు పాతర పేలుడులో ఇస్మాయిల్



షేక్ ఇస్మాయిల్ 1978లో ఆర్మ్‌డ్ కానిస్టేబల్‌గా చేరారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో డ్రైవర్‌గా పనిచేశారు. 2001 ఫిబ్రవరి ఒకటో తేదీన మావోయిస్టులు కురుపాం మండలంలో లోవలక్ష్మీపురం శివార్లలో ఓ కానిస్టేబుల్‌ను గాయపరిచి ఆయన వాహనాన్ని దహనం చేశారు. ఆ విషయాన్ని తెలుసుకుని పోలీస్ బృందం వెళ్తుండగా మందుపాతర పేల్చి, వారి వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనలో షేక్ ఇస్మాయిల్ మతిచెందారు.

మందుపాతర పేలి సూర్యనారాయణ..



ఎస్. సూర్యనారాయణ 1993లో సివిల్ కానిస్టేబుల్‌గా చేరారు. స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి 2003 మే 30న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా పెద్దింటి జోల అనే ప్రాంతం వద్ద మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందారు.

మందు పాతర పేలి శ్రీరాములు..



బి.శ్రీరాములు 1993లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. సౌమ్యుడిగా గుర్తింపు పొందారు. 2001 ఫిబ్రవరి 1న లోవలక్ష్మీపురం గ్రామం వద్ద జరిగిన మందు పాతర పేలిన ఘటనలో మృతి చెందారు.

పోలీసుల సేవలు మరువలేనివి:ఎస్పీ


వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు అమర వీరులను స్మరించుకుంటూ అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు, అదేవిధంగా ఈ నెల 31 వరకూ పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతియుత సమాజం కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం కోల్పోవడం వారి త్యాగనిరతికి నిదర్శనమని కొనియాడారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబరు 21న జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో గల స్మృతివనంలో విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించనున్నామని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ స్మృతిపరేడ్ నిర్వహించి, ర్యాలీ చేపడతామని తెలిపారు. అక్టోబరు 21 నుంచి 31 వరకూ జిల్లా వ్యాప్తంగా వివిధ సినిమా థియేటర్లలో పోలీసు ఇమేజ్‌ను రెట్టింపు చేసే విధంగా గుర్తింపు పొందిన సినిమాలను, వీడియో క్లిప్స్‌ను ప్రదర్శించేందుకు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. అక్టోబరు 22 నుంచి 30 మధ్య జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తూ, విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు అమరవీరుల స్వస్థలాలను, వారు చదువుకున్న పాఠశాలలను పోలీస్ అధికారులు, సిబ్బంది సందర్శించి, పోలీసుశాఖకు వారందించిన సేవలను వివరిస్తామని తెలియజేశారు. అక్టోబరు 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి, పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే వివిధ ఆయుధాలు, టెక్నాలజీ, నేర పరిశోధనలో డాగ్స్‌ను ఏ విధంగా వినియోగిస్తారన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. అక్టోబరు 24 నుంచి 27 వరకూ జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లోనూ, జిల్లా కేంద్రంలోనూ రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 28న పోలీసు కార్యాలయం ప్రాంగణంలో మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు కుటుంబాలు, సిబ్బంది, ప్రజలు పాల్గొని వైద్యసేవలను పొందవచ్చని పిలుపునిచ్చారు. అక్టోబరు 29న జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్ పరిధిలో ఉన్నపాఠశాలలు, కళాశాలల్లో పోలీసుల త్యాగాలు అనే అంశంపై సెమినార్స్ నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 30న జిల్లా కేంద్రంలో యూనిటీ రన్ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం మూడులాంతర్లు నుంచి కోట జంక్షన్ వరకూ క్యాండిల్ ర్యాలీ ఉంటుందని ప్రకటనలో ఎస్పీ వివరించారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదా నంలో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబాలను సన్మానించనున్నామని తెలియజేశారు.

విశాఖ డెయిరీ డైరెక్టర్ అమ్మడమ్మ మృతి


విశాఖ డెయిరీ డైరెక్టర్ శంబంగి అమ్మడమ్మ (ఫైల్)

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి గ్రామానికి చెందిన శంబంగి అమ్మడమ్మ(87)అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు.విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఆమె కొద్దిరోజులుగా అస్వస్థతకు గురై విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నయ్య శ్రీరాములు నాయుడు సతీమణి అయిన ఆమె గత 20 ఏళ్లుగా విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆమె కుమారుడు సుగుణాకరరావు (బుజ్జి)జలవనరులశాఖలో నార్త్‌కోస్టేచీఫ్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. అమ్మడమ్మ మృతితో కుటుంబసభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. అమ్మడమ్మ మృతి పట్ల నియోజవర్గంలోని పలువురు రాజకీయ నాయకులు, అధికార, ప్రతిపక్షాల వారు సంతాపం తెలియజేశారు.

నేడు అంత్యక్రియలు

విశాఖ నుంచి అమ్మడమ్మ పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం స్వగ్రామమైన పక్కి తీసుకురానున్నారు. అదేరోజు సాయంత్రం 4 గంటల సమయంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు.

వాలీబాల్ పోటీలకు జిల్లా జట్ల పయనం


హిందుపురంలో వాలీబాల్ పోటీలకు పయనమైన విజయనగరం జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగిరావాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీ.పిలుపునిచ్చారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం జిల్లా హిందుపురంలో జరగనున్న అంతర్ జిల్లాల అండర్–17 బాల,బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు ఆదివారం బయల్దేరారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు జిల్లా నుంచి 12 మంది బాలురు, 12 మంది బాలికలు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఏఎస్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏఎస్‌ఎం.కమలనాభరావు, నాగయ్య, బంగార్రాజు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్రానైట్ లీజు లైసెన్స్ రద్దు చేయాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని బడిదేవరకొండపై ఎంఎస్‌పీ గ్రానైట్ లీజు లైసెన్స్ అక్రమం, చట్టవిరుద్ధం, పర్యావరణ వ్యతిరేకమని రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లీజు లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కార్యాచరణ, పోరాటం చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 2016లో ఎంఎస్‌పీ గ్రానైట్స్ కంపెనీకి బడిదేవరకొండపై గ్రానైట్ చేసుకునేందుకు ప్రభుత్వం లీజు లైసెన్స్ ఇచ్చిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సభలో ప్రజలందరూ వ్యతిరేకించినా గ్రానైట్ లైసెన్స్ ఎలా ఇచ్చారు? ఇది ఆనాటి పర్యావరణ చట్ట విరుద్ధమని ధ్వజమెత్తారు. ప్రభుత్వం లీజు లైసెన్స్ ఇవ్వడానికి వ్యతిరేకంగా గతంలో ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఉద్యమించాయని గుర్తు చేశారు. అటవీ శాఖ రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందిన కొండపై లైసెన్స్ ఎలా ఇచ్చారని అభ్యంతరం చెప్పిందని ఫలితంగా ఫారెస్ట్, రెవెన్యూ ఉమ్మడి సర్వేలో బడిదేవరకొండ రిజర్వ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌దేనని తేలిందన్నారు. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఏంఎస్‌పీ గ్రానైట్ కంపెనీకి ఇచ్చిన లీజు లైసెన్స్ 2017లో రద్దు చేసిందన్నారు. ఇపుడు మళ్లీ అది రెవెన్యూ కొండగా ఎలా మారింది? డబ్బుంటే దానికి అధికారం తోడైతే ఏదైనా సాధ్యమేని లైసెన్స్ వ్యవహారం రుజువు చేసినట్లుందని విమర్శించారు.

బడిదేవరకొండకు పూజలు

మండలంలోని ప్రజలంతా బడిదేవరకొండను దేవతగా విశ్వసించి పూజలు చేస్తారని అందువల్లనే వర్షాలు కురిసి పంటలు పండుతున్నాయని, ప్రజల నమ్మకమన్నారు. అందువల్లనే పార్వతీపురం మండలానికి సాగునీటి ప్రాజెక్టులు లేకపోయినా పంటలు పండుతాయని చెప్పారు. బడిదేవర కొండ గ్రానైట్ పార్వతీపురం ప్రాంతం పర్యావరణ దెబ్బతీసి పార్వతీపురం ప్రాంత రైతులు, గిరిజనులు, ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు పి.శ్రీను నాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బి.నరసింగరావు ఈశ్వర రావు, సీపీఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం , సీపీఐ పట్టణ నాయకుడు ఆర్‌వీఎస్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్ కుమార్, జనసేన పార్టీ పట్టణ నాయకులు పి.జయ కృష్ణ, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, వి.దాలి నాయుడు, రెడ్డి వేణు, పి.సన్యాసిరావు, పి.రాము ముత్యాలు, కె రామస్వామి, లక్ష్మణరావు శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 11లోగా ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లించాలి

- జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిణి మంజులవీణ

పార్వతీపురంటౌన్: 2025వ సంవత్సరం మార్చిలో జరగనున్న మొదటి, రెండవ సంవత్సరాల ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజును నవంబరు 11 లోగా చెల్లించాలని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిణి డి.మంజులవీణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం థియరీ పరీక్షల ఫీజు రూ.600, జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు అదనంగా రూ.275, బ్రిడ్జి కోర్స్ రాయాలనుకున్న విద్యార్థులు అదనంగా రూ.165, మొదటి, రెండవ సంవత్సరం (రెండు సంవత్సరాల బ్యాక్‌లాగ్ పేపర్లు) పరీక్షలు రాస్తున్న విద్యార్థులు రూ.1200, మొదటి, రెండవ సంవత్సరం (రెండు సంవత్సరాలు కలిపి)ఒకేషనల్ ప్రాక్టికల్స్ రాస్తున్న విద్యార్థులు రూ. 550 చెల్లించాలని ఆమె తెలిపారు. హాజరు మినహాయింపు (ప్రైవేట్) విద్యార్థులు రూ.1500 ఫీజు చెల్లించాలని స్పష్టం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించడానికి ఆఖరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని తెలిపారు. రూ.1000 అపరాధ రుసుముతో నవంబర్ 20వ తేదీ వరకు ఫీజులు చెల్లించవచ్చని ఆమె పేర్కొన్నారు.

'రియల్' దగా..!

- సుమారు రూ.20 కోట్ల వరకు వసూలు
- బోర్డు తిప్పేసిన నిర్వాహకులు
- గగ్గోలు పెడుతున్న బాధితులు


రియల్ ఎస్టేట్‌లో ఇంటి స్థలం కోసం డబ్బులు కట్టి మోసపోయిన బాధితులు

వీరఘట్టం: పాలకొండ పరిసర ప్రాంతంలో అందమైన ఇంటిని కట్టుకోవాలనుకుంటున్నారా? అయితే మా వెంచర్లను సంప్రదించండి..సులభ వాయిదా పద్ధతిలో ప్రతి నెలా రూ.4000లు చొప్పున 50 వాయిదాలు చెల్లించి ఇంటి స్థలాన్ని మీ సొంతం చేసుకుని మీ కలలను సాకారం చేసుకోండని చేసిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ చేసిన ప్రచారంతో వందల మంది ఆకర్షితులై చివరికి మోస పోయారు. రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ఏజెంట్ల ద్వారా సుమారు రూ.20 కోట్ల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పాలకొండకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ నిర్వాహకులు వారాడ రాజేంద్రనాయుడు, రేజేటి శేఖర్, అలజంగి శంకరరావులు తనను ఏజెంట్‌గా పెట్టుకుని సుమారు రూ.60 లక్షలు కాజేశారని వీరఘట్టానికి చెందిన పిన్నింటి వెంకటరమణ శనివారం ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసి రియల్ ఎస్టేట్ నిర్వాహకులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. స్థానికులైన 41 మంది బాధితులు ప్రతి నెలా వాయిదాలు కట్టగా ఆ డబ్బులను నిర్వాహకులకు అందజేసినట్లు వెంకటరమణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. వాయిదా కాలపరిమితి ముగిసినప్పటికీ ఇంటి స్థలాలు కేటాయించకుండా సదరు నిర్వాహకులు తప్పించుకు తిరుగుతున్నారని, వాయిదాలు కట్టిన వారు తనను నిలదీస్తున్నారని ఫిర్యాదులో ఏజెంట్ వెంకటరమణ వాపోయినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్ చెప్పారు.

చాలా రోజులుగా ఫిర్యాదులు

పాలకొండకు చెందిన ఓ రియల్ ఎస్టేట్‌లో డబ్బులు కట్టి, వాయిదాలు ముగిసినా సదరు నిర్వాహకులు ఇంటి స్థలం అప్పగించడం లేదని చాలా మంది బాధితులు చాలా రోజులుగా వీరఘట్టం, పాలకొండ పోలీస్‌స్టేషన్లలో మౌఖికంగా ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే రాత పూర్వకంగా ఇంత వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. చివరకు వీరఘట్టానికి చెందిన ఏజెంట్ వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. బాధితులు మాత్రం ఏ ఏజెంట్ల వద్ద డబ్బులు కట్టారో వారిని నిలదీస్తున్నారు. ఆ రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ఎవరో మాకు తెలీదు. మీకే డబ్బులు కట్టాం కాబట్టి మీరే బాధ్యత వహించి మా డబ్బులు తిరిగి ఇప్పించాలని ఏజెంట్లపై ఒత్తిడి తేవడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో పోలీసులు తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కేసు నమోదు చేశాం..

వీరఘట్టానికి చెందిన పిన్నింటి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుపై రియల్ ఎస్టేట్ నిర్వాహకులపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

అధ్యాపకుడికి లెఫ్టినెంట్ ర్యాంక్


ఉదయ్‌కిరణ్‌కు లెఫ్టినెంట్ ర్యాంక్ బ్యాడ్జీ బహూకరిస్తున్న దృశ్యం

విజయనగరం అర్బన్: నగరంలోని సత్య డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ముమ్మిడిశెట్టి ఉదయ్‌కిరణ్‌కు లెఫ్టినెంట్ ర్యాంకు వరించింది. కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడైన ఆయన ప్రీ కమిషన్(పీఆర్‌సీఎస్) ఎన్‌సీసీ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా లెఫ్టినెంట్ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సాయిదేవమణి ఆదివారం తెలిపారు. మహారాష్ట్రలోని కంపీలోని ఓటీఏ(ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ)లో 85 రోజుల కఠిన శిక్షణా కాలంలో ఆయన సెరిమోనియల్ డ్రిల్ విధానాలు, ఫిజికల్ ఫిట్‌నెస్ నియమాలు, ఫైరింగ్ అండ్ వెపన్ హ్యాండ్లింగ్, మ్యాప్ రీడింగ్, నావిగేషన్ అండ్ లీడర్‌షిప్, హెల్త్ అండ్ హైజీన్, పొజిషన్ ఆఫ్ ఫైరింగ్, టీమ్‌వర్క్ స్కిల్స్ వంటి అంశాల్లో విశేషమైన నైపుణ్యం సాధించారని పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

నేడు తెప్పోత్సవం ట్రయల్ రన్

విజయనగరం టౌన్: నగరంలోని పెద్దచెరువులో తెప్పోత్సవం ట్రయల్ రన్ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు 40 మందితో ఈ ట్రయల్ రన్ చేపడుతున్నామన్నారు. పైడితల్లి సిరిమానోత్సవం పూర్తయిన మరుసటి రోజు అయిన మంగళవారం చేపట్టే తెప్పోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.